తను నిద్దర్లో వున్న సమయంలో ఏలారీ అయినా డీకొట్టని వుంటుంది. కాని అతనికి విచారం కలగలేదు.

"పోనీలే .. ఇంక ఎండలో రిక్షా లాగక్కర్లేదు. ఏ పల్లెటూరన్నా పోయి కూలిపని చేసుకుంటాను."

అమితమైన సంతోషంతో అన్నాడు!

కాని రామి యింకా అంటోంది:

"మరి అద్దెవాడిసంగతి? వాళ్లకిరిక్షా ఇయ్యొవద్దు?" అని.

కాని సీతయ్యకి ఆ మాటలు వినిపించడం లేదు. ★

## "చరిత్ర పునరావృత్త మవదు!"

కేశవరావు ఎంత చెప్పినా వినలేదు. వినడు. కారణ మేమిటా అని ఎంత ఆలోచించినా తెగటం లేదు. పోనీ నేను నమ్మేదాంట్లో లోపాలేమైనా వున్నాయేమోనని తరిచి తరిచి చూసుకున్నాను. కాని అటువంటి దేమీ జరగలేదు.

నా దృఢమైన నమ్మకం ఏమిటంటే- చరిత్ర పునరావృతం కాదని. నేను చదివిన సిద్ధాంతాలు దాన్ని బలపర్చాయి.

"చాలా మంది చరిత్ర ఏదో వృత్తం లోపలే తిరుగుతుందనుకుంటారు. పాత రోజులు మళ్ళీ వొస్తాయని నమ్మతారు. కాని అది అబద్ధం. చరిత్ర పునరావృత మవదు. ఒక స్పైరల్ లోవలె మెలికలు తిరిగి వున్నత పథాలకి చరిత్ర తగు గమనం సాగిస్తుంది" అనేది నా వాదన.

"కాదు. చరిత్ర పునరావృత మౌతుంది. మనం పాత రాతి యుగానికి ఏనాడో పోక తప్పదు" అని అతను మరింత

బలంగా వాదించే వాడు. ఆ మాటలు చెప్పేటప్పుడు కళ్లలో ఒక విధమైన వెలుగు, నేను మొదట అర్థం చేసుకోలేక పోయినది, కన్పించేది. అతి గాంభీర్యంగా మాట్లాడేవాడు.

నా వాదనని బలపర్చుకునేందుకు మనం ప్రిమిటివ్ సామ్యవాద స్థితి మొదలుకొని, భూస్వామ్య పెట్టుబడిదారి వర్గ స్థితికి, సామ్రాజ్యవాద దశనించి సోషలిజం వైపు ఎట్లా నడుస్తున్నామో నిరూపణలతో చెప్పేవాణ్ని.

పురాతన కాలంనాటి స్థితిగతులకి సంఘాన్ని, దేశాన్ని నడుపుదామనుకోవడం కూడా ఎట్లా భ్రమో తెలియపర్చే వాణ్ని.

అప్పటికి కొద్దిగా వూరుకునే వాడు. మర్నాడు మళ్లీ యథాప్రకారంగా వాదించేవాడు.

ఒకరోజు సాయంత్రం పార్కులో బలవంతం చేసి తనకి గల నిరూపణల్ని చెప్ప మన్నాను.

"నేను నమ్ముతున్నాను, అంతే" అన్నాడు మొండిగా.

కాని చివరికి తక్కువ స్వరంతో మొదలుపెట్టి చెప్ప సాగాడు. నేనుకూడా అతని సీరియస్ నెస్ ని అడ్డకండా, శ్రద్ధగా వినడం మొదలు పెట్టాను.

"నేను అట్లా అనుకోవడానికి, నీ వాదనల్ని తలకెక్కించుకో లేకపోవడానికి గల కారణం ఒక్కటే. దానికి నా చరిత్రే ఆధారం."

గొంతుకలో జీర వొస్తుంటే కంఠం సవరించుకున్నాడు.

"ఇరవయ్యో శతాబ్దంలో సగందాదాపు గడిచినా, ఇంకా కులభేదాలు సమయని భారత దేశంలో జన్మించినం

దుకు నేను పొందే బాధ చెప్పడానికి మాటలు చాలవు.

"నామాట అట్లావుంచు. మా నాన్న! ఆయన నాకు కొంతదారి సరి చేసినా నాకీదురవస్థ తప్పటంలేదు. ఆయ నెంత కష్టపడ్డాడో? పాపం! నాకు ఆ గాథ తల్చుకున్నప్పుడల్లా మనస్సు తరుక్కుపోతుంటుంది."

ఇక్కడ కాసేపు ఆగి, మళ్లా అందుకున్నాడు:

"చిన్నప్పుడు ఆడుకునే పిల్లల్లో, చదువుకునే టప్పుడు హాస్టల్లో, పెళ్ళిచేసుకునే విషయంలో, తర్వాత జీవితంలో మా నాన్న అనుభవించిన బాధని అర్థం చేసుకోవడం మరో మనిషి తరం కాదనుకుంటాను. ఆయన ఒక్కొక్క సమయం లో కూచుని గంటలతరబడి లోలోపల కుమిలి దుఃఖించేవారు.

"ఆ దృశ్యాలు ఇప్పటికీ, ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన చేసిన పాపం తక్కువ కులంలో జన్మించడం. ఆయన యే విధంగానూ బాధ్యుడు కాని ఆయన పుట్టుకని గురించి రంపపు కోతకి బలి అవడం ఏమంత న్యాయం?

"ఇప్పుడు నా జీవితం అంతే! ఎవళ్ళో నీ వంటి వారు తప్ప అతి సున్నితమైన నా మనస్సుని నిర్దాక్షిణ్యంగా కష్టపెట్టేవాళ్ళు ఎంతమంది లేరని! అవును. ఇతరుల్ని పీడించడం కొందరు మానవులు వింత ఆటగా భావిస్తారు; ఆనందిస్తారు. కొందరికి అదే వృత్తికూడా. వాళ్ళజోలు మనకెందుకులే.

"ఇంతవరకూ జరిగిన నా జీవితపు పుటలు తిరగవేసి చూసుకుంటే మా నాన్న అనుభవించిన కష్టాల వంటి కష్టాల సంఘటనలతో కూడిన గాథలే కనిపిస్తాయి.

"ముఖ్యం పెళ్లి విషయం. ఎంత చదువుంటేనేం?

ఎంత విశాల హృదయుడవుతేనేం? తక్కిన ఉన్నత లక్షణాల కంటె కులం అధికతమమైంది... వాళ్లకి!— లోకోద్ధార కుల్లా మాట్లాడుతారుమల్లా. అందుకే మనసులోనే కుళ్ళి, ఆశయాన్ని స్వహస్తంతోనే తుంచేసుకొని అజ్ఞాతపు జీవితాన్ని గడపడానికి సిద్ధమవ వల్సి వొచ్చింది మా నాన్న.

"మధ్య ఇన్నాళ్ళు జరిగినా నా స్థితి కూడా అదే దారిలో నడిచేలా వుంది. ఈ వున్నత కులస్థుల మనుకునే హృదయ శూన్యులు కొంచపర్చి నప్పుడు ఆత్మహత్య చేసుకుందా మా అనిపిస్తుంది" అని ముగించాడు కేశవరావు...ఇది జరిగిన రొండేళ్లకే తను బి. ఎ. చదువుతున్నప్పుడు, తన్ని ప్రేమించిన బ్రాహ్మణుల అమ్మాయితో వివాహం జరిగి, తన నమ్మకాన్ని మార్చుకపోతే, ఇంకా "చరిత్ర పునరావృత మౌతుం"దనే నమ్ముతూ వుండును అతను.

అతని పెళ్లికినే పంపిన సందేశం: "చరిత్ర పునరావృత మవదు" అని. ★

## కుమారసంభవమ్

"ఛా! ఇంకా మానలేదూ? నేను చెప్పానుగా. ఒక్క కుమారసంభవమైతే వాడి తిక్క అదే తిరుగుతుంది. దీనికి ఏడుపెందుకే? లే, వాడు చూస్తే బాగుండదు" అంది రత్తమ్మ గారు.

ఈ అనునయంతో శారదలేచి కళ్లు తుడుచుకుంది. వంటింట్లోకి వెళ్లి పీట వేసి వడ్డించ సాగింది. భర్త రామం వచ్చి